క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ మల్లిఖార్జున్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 13న నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థులు ఎం. దుర్గాభవానీ, ఎం.కావ్య, ఫస్టియర్ విద్యార్థి శ్రీచరణ్ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి చిత్తూరు జిల్లా నగిరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి


ఆధార్ లింక్ చేసుకుంటున్న ఉపాధి కూలీలు

దక్కిలి (బాలాయపల్లి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ఆధార్ లింక్ తప్పనిసరి అని ఉపాధి ఏపీఓ మృత్యుంజయరావు అన్నారు. బుధవారం బాలాయపల్లిలోని ఉపాధి కార్యాలయంలో బ్యాంకు లింకేజీ కోసం పోస్టల్ శాఖ ద్వారా ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. ఆధార్ అనుసంధానం చేసుకోకపోవడం వల్ల నగదు చెల్లింపుల్లో ఆలస్యం అవుతోందని తెలిపారు. శిబిరంలో సుమారు 673 మందికి ఆధార్ అనుసంధానం చేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన కండలేరు గురుకుల విద్యార్థినులు

రాపూరు: కండలేరు గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో 10 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ భారతి తెలిపారు. తెనాలిలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగిన పోటీల్లో హజీరా, ప్రణతి బంగారు పతకాలు, మల్లేశ్వరి, బ్రహ్మేశ్వరి, లక్ష్మీప్రసన్న, రేష్మ, నిహారిక, త్రివేణి రజత పతకాలు, తులసి, లక్ష్మీ ప్రియ కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థినులు, పీఈటీలు శాంతకుమారి, చంద్రలేఖను జిల్లా కోఆర్డినేటర్ హేమలత అభినందించారు.

ఆరోపణపై విచారణ


ప్రిన్సిపల్ వరప్రసాద్‌ను విచారిస్తున్న ఏడీ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో గతంలో పనిచేసిన వరప్రసాద్‌రావుపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టేట్ ఇంటర్మీడియెట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు బుధవారం వెంకటగిరిలోని జూనియర్ కళాశాలకు చేరుకుని వరప్రసాద్‌రావును విచారించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. వరప్రసాద్‌రావుపై 19 ఆరోపణలు వచ్చాయని.. ఈ మేరకు విచారిస్తున్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రమేష్

చిల్లకూరు: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిల్లకూరు గ్రామానికి చెందిన పుత్తేటి రమేష్ కోటలో టైలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పనికి వెళ్లేందుకు చిల్లకూరులోని ఇంటి నుంచి కోటకు బయలుదేరాడు. జాతీయ రహదారిలో మరమ్మతు పనుల కారణంగా ఒకవైపునే రాకపోకలు సాగిస్తున్నాయి. రమేష్ రోడ్డు దాటే క్రమంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో గూడూరుకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్‌ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 11.565 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.565 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

శక్తిస్వరూపిణి పాహిమాం

- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- కిటకిటలాడిన ఆలయాలు


నాయుడుపేట: కన్యకాపరమేశ్వరి


సూళ్లూరుపేట: అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు


చిట్టమూరు: అన్నపూర్ణాదేవిగా..


వెంకటగిరి: నరసింహ అవతారంలో వెంకటేశ్వరస్వామి

రాపూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెంచలకోనలో వెలసిన ఆదిలక్ష్మీదేవి బుధవారం ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్నపన తిరుమంజనం, రాత్రి దర్బారు సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రాపూరులోని కన్యాకాపరమేశ్వరి అమ్మవారు పార్వతిదేవిగా, వేపినాపిలోని అంకమ్మ అన్నపూర్ణదేవిగా భక్తులను కటాక్షించారు.

మహాలక్ష్మిగా చెంగాళమ్మ

సూళ్లూరుపేట రూరల్/చిల్లకూరు: సూళ్లూరుపేట చెంగాళమ్మ, చిల్లకూరు మండలం కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ఉదయం చండీయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక కుంకుమార్చన చేశారు.

దక్కిలి: మండలంలోని దేవుని వెల్లంపల్లి గ్రామంలో వెలసిన స్తంబాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయంలో పార్వతిదేవి లలిత త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చిట్టమూరు: మల్లాంలోని కామాక్షిదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

వెంకటగిరిరూరల్: పట్టణంలోని కర్ణమ్మవీధిలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు నరసింహుని అవతారంలో దర్శనమిచ్చారు. కాత్యాయనిదేవిగా సంతానలక్ష్మిగా, వెలమపాళెంలో అన్నపూర్ణగా, కళ్యాణపరమేశ్వరి ఆలయంలో పద్మావతి దేవిగా పూజలందుకున్నారు.

సైదాపురం: మండల కేంద్రంలోని శ్రీబాలత్రిపుర సుందదేవి ఆలయంలో ఉదయం అభిషేకం, పూలంగి సేవ, లలిత సహస్రపారాయణం, రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానం చేశారు.

మోహినిదేవిగా ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు మోహినీదేవిగా భక్తులను కటాక్షించారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగించారు. చెన్నైకు చెందిన పోలాని తిలక్‌కుమార్ స్వామి బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

నాయుడుపేట: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి బాలాత్రిపురసుందరిదేవిగా, మూగాంబిక ఆలయంలో మహాలక్ష్మిగా, పోలేరమ్మ లలిత త్రిపుర సుందరి అలంకారంలో కొలువుదీర్చారు. పోలేరమ్మ ఆలయ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, కమిటీ సారథ్యంలో లక్ష కుంకుమార్చన చేశారు.

అన్నపూర్ణాదేవిగా శ్రీరాజరాజేశ్వరి

గూడూరురూరల్: పట్టణంలోని హైస్కూల్‌రోడ్డులో వెలసిన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సాయి సత్సంగ నిలయంలో విజయదుర్గ అమ్మవారు, సొసైటీలోని నారాయణమ్మ పేరంటాళ్లు అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. బజారువీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మోహినీ అలంకారంలో దర్శనమిచ్చారు.


రాపూరు: పెంచలకోనలో ధైర్యలక్ష్మిగా..


సూళ్లూరుపేట: మహాలక్ష్మిగా చెంగాళమ్మ


చిల్లకూరు: మహాలక్ష్మీదేవిగా..


వెంకటగిరి: అన్నపూర్ణదేవిగా..


చిల్లకూరు: ముత్యాలమ్మ


నాయుడుపేట: లలిత త్రిపురసుందరిగా పోలేరమ్మ

మభ్యపెట్టే మాటలే 'ఆనం'దం


లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : ప్రజలు మంచి చేస్తారని ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆనం రామనారాయణ రెడ్డి ఆనందంగా మభ్యపెట్టే మాటలతో మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఘెమర్శించారు. బుధవారం బంగారుపేట సచివాలయం పరిధిలోని 2వ వార్డు బీసీ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి జగనన్న లేఅవుట్‌లలో అక్రమాలు, అవకతవలకు పాల్పడినట్లు ఆరోపించారు. అమాయక పేదలను కడుపుకొట్టారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి గడపకు వెళుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాలనపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికపై ఉందని పిలుపునిచ్చారు. ఈ మేరకు సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య, కౌన్సిలర్లు సుబ్బారావు, కల్యాణి, ఆటంబాకం శ్రీనివాసులు, స్థానిక నేతలు వలికల కృష్ణయ్య, అప్పిన కాంతారావు, కామయ్య, పాలకొండయ్య, శివకుమార్, మేకల శ్రీనివాసులు, నాగరాజు, తిరుమల పాల్గొన్నారు.

జగన్ పుణ్యమే నాయనా!

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఓ అద్భుత అనుభవం ఎదురైంది. ప్రభుత్వ పనితీరుపై జి.ఈశ్వరమ్మ (78) అనే వృద్ధురాలు ప్రశంసలు కురిపించారు. నడవలేని పరిస్థితిలో ఉన్న తన మంచం వద్దకే ప్రతి నెలా పింఛన్ అందుతోందంటే అది జగన్ పుణ్యమే నాయనా అని కృతజ్ఞతలు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చేదని, ప్రదక్షిణలు చేస్తే అందించేవారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ ఇంటి పెద్దబిడ్డలా ఆదుకుంటున్నారని కొనియాడారు. వలంటీర్ల ద్వారా వృద్ధులకు భరోసా కల్పిస్తున్నారని, సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు.


రామ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న వృద్ధురాలు

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బుధవారం సాయంత్రం గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన దిశానిర్దేశం చేశారు. వరప్రసాద్‌రావు మాట్లాడుతూ.. అందరం కలసికట్టుగా పనిచేసి మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష వంటి చక్కటి కార్యక్రమాలతో ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లారన్నారు. ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించడం, గ్రామ పెద్దలతో డిన్నర్ చేయడంతోపాటు రాత్రిపూట బసచేసి మరుసటిరోజు ఉదయం ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి ఇంటింటి ప్రచారం చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార కిట్‌లను ప్రతి సచివాలయానికి సరిపడే విధంగా అందజేస్తామన్నారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎందరో కష్టపడ్డారని తెలిపారు. బయటి నుంచి ఎవరో వచ్చి ఇప్పుడు నాయకులు, కార్యకర్తల్లో అపోహలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, నాయకులు కోడూరు మీరారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, బొమ్మిడి శ్రీనివాసులు, రాఘవరెడ్డి, శ్రీహరి, మనోజ్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- గడప గడపకు మన ప్రభుత్వంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


వలంటీర్లకు నియామక పత్రం అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ప్రజా సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం బంగారుపేట సచివాలయం పరిధిలో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాగా ఈ నెల 16వ తేదీ ఆయన పర్యటన సందర్భంగా వలంటీర్ల కొరత ఉందని.. ప్రభుత్వ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రామ్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ అధికారులతో చర్చించి ఖాళీల భర్తీకి చర్యలు తీసుకున్నారు. బుధవారం బంగారుపేటకు చెందిన పి.కామాక్షి, పావనిలకు నియామక పత్రాలు అందజేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్ సుబ్బారావు, కళ్యాణి, నాయకులు కృష్ణయ్య, కాంతారావు, ఆవులగోపాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం


మైకా గనిని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

సైదాపురం : అటవీ ప్రాంతంలో ఖనిజాల కోసం అక్రమంగా తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని, నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని నెల్లూరు డీఎఫ్ఓ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం సైదాపురంలోని షామైన్ మైకా గనిని పరిశీలించారు. అనంతరం సమీపంలోని పలు గనులను తనిఖీలు చేశారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ మండలంలోని అటవీ ప్రాంతంలో ఖనిజాల తవ్వకంపై ముమ్మరంగా దాడులు చేస్తున్నామన్నారు. అలాగే కట్టుదిట్టంగా నిఘా పెట్టినట్లు వెల్లడించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి సిబ్బంది రవిశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భద్రత


దొరవారిసత్రం: పౌష్టికాహారాన్ని ప్రదర్శనలో ఉంచిన అంగన్‌వాడీ కార్యకర్తలు

కోట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ భవానీ కోరారు. బుధవారం కోట దళితవాడలో వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు.

దొరవారిసత్రం/దక్కిలి: తొగరాముడి పీహెచ్‌సీ పరిధిలోని తల్లంపాడు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యులు చైతన్య, విశ్వప్రియా, చిర్మిల పాల్గొన్నారు. దక్కిలి మండలం వెంబులూరు సచివాలయం పరిధిలో వైద్య పరీక్షలు చేశారు.

వెంకటగిరిరూరల్: మండలంలోని పాళెంకోట గ్రామంలో 358 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 73 మందికి ఎంపీడీఓ విజయలక్ష్మి ఆయుష్మాన్ కార్డులను అందజేశారు.

చిల్లకూరు/చిట్టమూరు: చిల్లకూరు మండలం కడవేడు, చిట్టమూరులోని ఆరూరులో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి పెద్దాస్పత్రులకు రెఫర్ చేశారు.

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు అన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామంలో 172 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందజేస్తామన్నారు.


కోట: కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ భవాని


వెంకటగిరి: జగనన్న సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న వైద్యులు


చిట్టమూరు: ఆరూరులో..


సైదాపురం: పరీక్షలు చేస్తున్న సిబ్బంది